ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3

జయశంకర్ భూపాలపల్లి ములుగు

బుధవారం 18 సెప్టెంబరు 2024



భూపాలపల్లి కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రసంగిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

పేదరికంపై యుద్ధం చేయాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

- విద్య, వైద్యంతోనే అభివృద్ధి సాధ్యం
- త్యాగం, అమరత్వంతో తెలంగాణకు స్వాతంత్ర్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ములుగులో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ములుగు, సెప్టెంబరు 17: ప్రజలందరికీ సామాజిక న్యాయం జరగాలంటే పేదరికంపై యుద్ధం చేయాల్సిందేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జిల్లాకేంద్రంలో మంగళవారం అట్టహాసంగా జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసిన మంత్రి సీతక్క, తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపానికి నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. త్యాగం, అమరత్వంతో తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. తెలంగాణ ప్రాంతానికి ప్రజాస్వామిక స్వేచ్ఛ సాధించేందుకు కుమ్రం భీం, దొడ్డి కొమురయ్యతోపాటు మహనీయులు రావి నారాయణరెడ్డి, స్వామి రామానంద తీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం, దేవులపల్లి వెంకటేశ్వ ర్‌రావు, బద్దం ఎల్లా రెడ్డి వంటి ఎందరో ప్రాణ త్యాగాలకు సిద్ధపడ్డారని స్మరించుకున్నారు. ఫలితంగా 1948 సెప్టెంబరు 17న తెలంగాణ రాచరిక పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో అంతర్భాగంగా మారిందని తెలిపారు. తమ అక్షరాలతో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిన సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, దాశరథి కృష్ణమాచార్య, మగ్దూం మొహి యొద్దీన్, సుద్దాల హన్మంతు, బండి యాదగిరి, షోయేబుల్లాఖాన్ వంటి సాహితీ మూర్తులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాపాలనతో రాష్ట్రాభివృద్ధి

తెలంగాణకు స్వేచ్ఛనిచ్చేందుకు పోరాడిన యోధుల స్ఫూర్తితో కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన సాగిస్తోందని సీతక్క అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం, అట్టడుగువర్గాల ఆకలి తీర్చేందుకు పాటు పడుతున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 48గంటల్లోనే ఆరు గ్యారెంటీల అమలును ప్రారంభించి చరిత్ర సృష్టించామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇప్పటి వరకు జిల్లాలో 54.38లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తూ పేదకుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని, జిల్లాలోని 48,493 మంది లబ్ధిదారులను గుర్తించి 90,290 సిలిండర్లను సరఫరా చేశామన్నారు రాజీవ్‌గాంధీ ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామని, 163 చికిత్సలను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. జిల్లావ్యాప్తంగా 3061మందికి రూ.6.31కోట్ల విలువైన వైద్యసేవలు అందించామని వెల్లడించారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 39,528 కుటుంబాలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, ఇందుకు రూ.7.03కోట్ల సబ్సిడీని చెల్లించామని తెలిపారు. జిల్లాకు 3,790 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. రూ.2లక్షల లోపు వ్యవసాయ రుణాన్ని మాఫీ హామీని అమలు చేస్తూ 23,857 మంది రైతులకు రూ.194.57 కోట్లను మాఫీ చేశామన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15వేల చొప్పున అందించేందుకు సంకల్పించుకున్నామని, విధివిధానాలు రూపొందించి త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తామని, తద్వారా సన్నాల సాగును ప్రోత్సహిస్తామని చెప్పారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ వ్యవసాయ- రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రైతాంగానికి పంటల బీమా పథకాన్ని వర్తింపజేసేందుకు ఈఏడాది నుంచి ఫసల్‌బీమా యోజన పథకంలో చేరాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేశామని, అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చడమే కాకుండా ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకోసం కృషి జరుగుతోందని వెల్లడించారు. 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇందిరా మహిళాశక్తి పథకానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామని తెలిపారు.



ములుగులోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

అధికారులకు సన్మానం

ఇటీవల జిల్లాలో ప్రకృతి వైపరీత్యంతో కురిసిన భారీ వర్షాలు, వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు కృషి చేసిన అధికారులను మంత్రి సీతక్క శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాను బహూకరించారు. ముందస్తు విపత్తు నివారణ చర్యల కోసం ఐదుగురు అధికారులతో మండలాల వారీగా టీమ్‌లను ఏర్పాటు చేశామని, దీంతో ఈసారి జిల్లాలో ప్రాణ, ఆస్తినష్టం తక్కువగా వాటిల్లిందని అన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు పొందిన ఇరువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, గిరిజన ఉపశమన నిధి కింద ఏడుగురికి ఆర్థికసాయం పంపిణీ చేశారు. అదేవిధంగా గట్టమ్మ జిల్లా మహిళా సమాఖ్యకు రూ.5కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్. దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ

అభివృద్ధి పథంలో తెలంగాణ

- సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రగతి
- సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సర్కారు
- చివరి వరుసలో ఉన్న పేదలకూ లబ్ధి
- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 17: అభివృద్ధిపథంలో తెలంగాణ ముందుకు దూసుకెళ్తోందని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాకాంక్ష మేరకు పాలన కొనసాగుతూ అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తోందన్నారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17లో తెలంగాణ నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 76 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. 77 సంవత్సరాల్లో అడుగుపెడుతున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలప దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనిక పాలనలో విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి కల్పన, విద్య, వైద్య రంగాల్లో గణనీయ అభివృద్ధిని రాష్ట్రం సాధిస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో కుప్పకూలిన వ్యవస్థలను చక్కదిద్దే పనిని రేవంత్ సర్కారు ప్రారంభించిందన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలనే లక్ష్యంతో పారదర్శకమైన పాలన అందించడంలో భాగంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ రంగాలపై శ్వేతపత్రాలను విడుదల చేశామన్నారు. ఇంతకాలం ప్రజలకు అందుబుబాటులో లేని ప్రగతిభవన్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే ముళ్లకంచెల చెర నుంచి విముక్తి కలిగించామన్నారు. చివరి వరుసలో ఉన్న పేదలకు కూడా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులోభాగంగా ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా జిల్లాలో 1,37,454 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 59,30,322 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారన్నారు. దీంతో మహిళలకు రూ. 31,05,67,172 కోట్లు ఆదా అయినట్లు తెలిఅరు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సాయన్ని రూ. 10లక్షలకు పెంచిన అనంతరం జిల్లాలో ఇప్పటి వరకు 5,187 మందికి వైద్య సేవలు అందించామన్నారు. ఇందుకు 10,50,53,744 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రైతులకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. జిల్లాలో 22,357 మంది రైతులకు రూ.277.31 కోట్ల రుణాలను మాఫీ చేశామని తెలిపారు. 72,766 మంది రైతులకు రైతుబీమాను వర్తింపజేశామన్నారు. అకాల మరణం పొందిన 402 మంది రైతు కుటుంబాలకు రూ. 20.10 కోట్ల ఆర్థికసాయం అందజేశామన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 51,628 మంది లబ్ధిపొందుతున్నారన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 66,019 మంది లబ్ధిపొందుతున్న తెలిపారు. సీజనల్ వ్యాధులు జిల్లాలో ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన అధిక వర్షాలతో చెరువులు, కుంటలు తెగిపోకుండా జిల్లా అధికారయంత్రంగం ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ప్లేట్‌లెట్ కౌంట్ యంత్రం



- ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ
- ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా
- డయాలసిస్ రోగులకు మరో 14 పడకలు

ఎంజీఎంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ

వివరాలు 5లో

ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య



- వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వాల తీరుతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం

కంటెయినర్ పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

వివరాలు 4లో

ఇంచర్ల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు



అవగాహన కల్పిస్తున్న చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ మహేందర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17: ములుగు మండలంలోని ఇంచర్ల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈసందర్భంగా చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ మేకల మహేందర్ విద్యాహక్కుచట్టం, బాల్య వివాహ నిరోధకచట్టం, బాలకార్మిక చట్టం, ఉచిత న్యాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు సబితారాణి, ఉపాధ్యాయులు గాయత్రి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్‌బరస్ట్ ప్రాంతాన్ని పరిశీలించిన విజిలెన్స్ పీసీసీఎఫ్



చెట్టు కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్

తాడ్వాయి, సెప్టెంబరు 17: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో గతనెల 31న జరిగిన క్లౌడ్‌బరస్ట్ ప్రాంతాన్ని విజిలెన్స్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ అఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఏలూసింగ్‌మేరు మంగళవారం సందర్శించారు. ములుగు జిల్లా అటవీశాఖ, వన్యప్రాణి విభాగం అధికారుల బృందం సంయుక్తంగా గత 15 రోజులుగా క్లౌడ్‌బ్రస్ట్ ప్రదేశంలో వృక్షాల వివరాలు సేకరిస్తూ ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం పీసీసీఎఫ్ ఈ ప్రదేశంలో అధికారుల బృందంతో పర్యటించారు. క్లౌడ్‌బ్రస్ట్ జరిగిన విధానాన్ని ములుగు డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా పీసీసీఎఫ్‌కు వివరించారు. దీనిపై అధికారుల బృందం సర్వే కొనసాగుతోందని తెలిపారు. వివిధ రకాల భారీ వృక్షాలు, వాటి విలువ, వృక్షజాతులు, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం, తాడ్వాయి ఎఫ్‌డీవోలు వజ్రారెడ్డి, ప్రభాకర్, స్థానిక ఎఫ్ఆర్‌వోలు కృష్ణవేణి, సత్తయ్య, షౌకత్‌అలీ, సెక్షన్ ఆఫీసర్లు, వన్యప్రాణి విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 17: వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూపాలపల్లి మండలం పెద్దాపూర్ శివారు పెరుకపల్లి గ్రామంలో మహిళపై లైంగిక దాడి కేసులో మాదం శివకుమార్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ములుగు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు. భారతీయ న్యాయసేవా సన్నిహిత సెక్షన్ -64 కింద రేప్ కేసు, తలుపులు పగులగొట్టి, కరెంటు బంద్‌చేసి బెదిరించినందుకు 333 సెక్షన్, లైంగికదాడి చేసినట్లు ఎవరికైనా చెబితే బాధితురాలి కొడుకు చంపేస్తానని బెదిరించినందుకు 351(1) సెక్షన్ ప్రకారం శివకుమార్‌పై కేసులు నమోదైందని తెలిపారు. ఈ క్రమంలో ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. అనంతరం ములుగు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించి ఖమ్మం జైలుకు తరలించారని పేర్కొన్నారు. నిందితుడి అరెస్టుకు కృషి చేసిన ములుగు సీఐ శంకర్, వెంకటాపూర్ ఎస్సై సతీష్‌ను అభినందించారు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం 1948 సెప్టెంబరు 17 నాడే వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా రజాకారుల నిరంకుశత్వాన్ని సమర్థిస్తోందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రజాపాలన దినోత్సవంగా మార్చి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాం చేస్తోందన్నారు. కాంగ్రెస్ విధానాలను భూస్థాపితం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాపాయ్య, లింగంపల్లి ప్రసాద్‌రావు, జిల్లా నేతలు దొంగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి



ములుగు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ములుగులో...

ములుగు కలెక్టరేట్: ములుగులోని బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవం కోసం రజాకార్లను ఎదిరించిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా ఖాసిం రజ్వీ మెడలు వంచి నిజాం నిరంకుశ పాలన నుంచి 1948 సెప్టెంబరు 17న విముక్తి కలిగించారని అన్నారు. 75సంవత్సరాలుగా అనేక పార్టీలు అధికారం చేపట్టి కనీసం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా చరిత్రను వక్రీకరించే విధంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. విమోచన దినోత్సవాన్ని ప్రజాపరిపాలన దినోత్సవం కార్యక్రమంగా చేపట్టడం సరికాదని అన్నారు.

కాళేశ్వరంలో గోదావరికి హారతి

మహదేవపూర్, సెప్టెంబరు 17 : మండలంలోని కాళేశ్వరం వద్ద అర్చకులు గోదావరి హారతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం నుంచి బయల్దేరి వెళ్లారు. గోదావరి నది వద్దకు వెళ్లి నదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్త శ్యాంసుందర్, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీతక్క, ఎంపీ బలరాం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 17: ఆదివాసీ చిన్నారులకు మెరుగైన విద్య నందించి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొత్తికోయ గూడేమైన బంగారుపల్లిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన కంటెయినర్ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత మంత్రి సీతక్కకు గొత్తికోయలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కంటెయినర్ పాఠశాలను ప్రారంభించిన సీతక్క విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య నందించే లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. బడులకు భవనాలను నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోతుండటం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్మించలేకపోతున్నామని, ఈ క్రమంలోనే బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంటైనర్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వందలాది పాఠశాలలు మూత పడ్డాయని విమర్శించారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రేవంత్ నేతృత్వంలో తమ సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఓఎస్డీ మహేష్‌బాబా సాహెబ్ గీతె, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మంత్రి సీతక్క

ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామోదర్



కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 17: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ నియమితులయ్యారు. బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు అనంత్‌శర్మ దామోదర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా పని చేస్తున్న దామోదర్‌ను కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సీనియర్ సెక్రటరీగా కూడా బాధ్యతలు అప్పగించారు. 30 ఏళ్లుగా దామోదర్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వినియోగదారుల చైతన్య సదస్సులు, ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు, టెస్ట్ చెక్‌లు, తూనికలు, కొలతల మోసాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు గడువు 1

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సోషల్‌సైన్స్, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ మొదటి దఫా లిస్టులో 2021-22 ఏడాదికి అడ్మిషన్లు పొందిన అభ్యర్థులందరూ అక్టోబరు 1 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పీఎస్‌ఎల్ సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు ఫీజులు చెల్లించుకోవాలని వివరించారు. ధృవపత్రాలు, ఇతర పీహెచ్‌డీ అడ్మిషన్ల జాయినింగ్ రిపోర్టులతో ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను మళ్లీ నిర్వహించాలి

రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆశావహుల నిరాహార దీక్షలు



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించి ఆశావహులకు న్యాయం చేయాలని విద్యార్థులు రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన దీక్షలు చేపట్టారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. ఆరోగ్య, కుటుంబ సమస్యలతో కేయూలో జరిగిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు హాజరు కాని అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూల్లో మెరిట్ ఆధారంగానే పీహెచ్‌డీ సీట్లను కేటాయించి న్యాయం చేయాలని అన్నారు. ఇంటర్వ్యూలకు రాని అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించిన అందరికీ న్యాయం చేయాలని వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. కాగా, మంద నరేశ్ చేపట్టిన దీక్షల వద్దకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీ రామోజు నరసింహచారి తదితరులు వచ్చి చర్చలు జరిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలు విరమించారు. ఈ దీక్షల్లో పీహెచ్‌డీ ఆశావాహులు, పరిశోధకులు పాల్గొన్నారు.



కేఎంసీలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, తదితరులు

ఎంజీఎంలో అందుబాటులోకి ప్లేట్‌లెట్ యంత్రం


- ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ
- ఎంజీఎంలో వైద్య సేవలపై ఆరా
- డయాలసిస్ రోగులకు మరో 14 పడకలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలో రూ.41లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సింగిల్‌డోనర్ ప్లేట్‌లెట్ కౌంట్ మెషిన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఆస్పత్రిలోని పలు విభాగాలైన ఔట్ పేషంట్, ఆరోగ్యశ్రీవార్డు, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి రోగుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వల్ల రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయని, ఎస్‌డీపీ మెషిన్ ఏర్పాటుతో ఈ సమస్య తీరుతుందన్నారు. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేకరించేందుకు ప్రయివేట్ ఆస్పత్రిలో రూ.12వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ ఎంజీఎం ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని పీఎంఎస్‌ఎస్‌వై ఆస్పత్రిలో 14పడకలకు అప్‌గ్రేడ్ చేసి డయాలసిస్ సెంటరును మంత్రులు ప్రారంభించారు. అదనంగా 10 డయాలసిస్ పడకల యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ మెడికల్ కళాశాలలో రూ.3.45కోట్ల వ్యయంతో నిర్మించే అంతర్గత రోడ్ల పనులను మంత్రులు ప్రారంభించారు. అనంతరం పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో పిల్లల తల్లిదండ్రులకు కల్పిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్‌ఎంవోలు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన ఎంపీ కావ్య



తనిఖీ చేస్తున్న ఎంపీ కావ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: వరంగల్ ఎంజీఎంలోని ఫార్మసీ విభాగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకొచ్చాడు. వెంటనే స్పందించిన ఎంపీ కడియం కావ్య రోగిని తీసుకొని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చేరుకొని పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. స్టాక్ వివరాలను, రిజిస్టర్‌ను పరిశీలించారు. సుమారు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎంలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

ఎంజీఎం అధికారులతో వరంగల్ కలెక్టర్ సమీక్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలోని అన్ని విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఎంజీఎంలోని డెర్మటాలజీ విభాగాన్ని పీఎంఎస్‌ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కేఎంసీ హనుమకొండలోకి మార్చాలని ఆదేశించారు. ఎంజీఎం ఫార్మసీ, స్టోర్ విభానికి సంబంధించిన వివరాలు తీసుకొని సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న షాపుల అనుమతుల గురించి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



అక్టోబరు 2వరకు 'స్వచ్ఛతా హి'

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కాశిబుగ్గ, సెప్టెంబరు 17: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవా -24 కార్యక్రమాల నిర్వహణకు కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేపట్టాల్సిన ప్రచార, పారిశుధ్య కార్యక్రమాల వివరాలను అధికారులు ప్రకటించారు. 'స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత'ను 2024 థీమ్‌గా ప్రకటించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన, పాఠశాలలు, అంగన్‌వాడీ తదితర కేంద్రాల్లో శ్రమదానం, ఇంటింటికి దోమల నివారణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం, యువతకు క్రీడాకార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, స్వచ్ఛ సాంస్కృతిక కార్యక్రమాలు, మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించనున్నారు. గ్రామసభలు, వైద్య పరీక్షల నిర్వహణ, పారిశుధ్య అవగాహన ప్రదర్శనలు, పారిశుధ్య సిబ్బందికి సన్మానం, స్వచ్ఛత ప్రతిజ్ఞ, బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది.

రోజువారీ కార్యక్రమాలిలా..

- 17న మానవహారాలు, ప్రతిజ్ఞ, చెత్త సేకరణ డబ్బాల ఏర్పాటు.
- 18న వివిధ వర్గాల భాగస్వామ్యంతో సామూహిక పారిశుధ్య కార్యక్రమం
- 19, 20న మొక్కలు నాటడం, ప్రతీ ఇంట అవగాహన, నీటి వనరుల శుద్ధీకరణ
- 21, 22, 23న మొక్కలు నాటడం, ఇంటింటి ప్రచారం, విద్యార్థులతో మానవహారాలు, వ్యర్థాల తొలగింపు.
- 24న ప్రత్యేక పారిశుధ్య పనులు
- 25న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ సంచుల వాడకంపై ప్రచారం.
- 26న స్వచ్ఛ ఆహార వినియోగంపై కళా ప్రదర్శనలు
- 27న యాత్ర, పర్యాటక స్థలాల్లో పారిశుధ్య పనులు, పోటీల నిర్వహణ
- 28న సఫాయి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు
- 29న సఫాయి మిత్ర సురక్ష శిబిరం, వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణ.
- 30న స్వచ్ఛతపై ప్రతిన, మానవహారాల ఏర్పాటు, మొక్కలు నాటడం, కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు.
- అక్టోబరు 1న సంపూర్ణ స్వచ్ఛత పట్టణంగా ప్రకటన.
- 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ దివస్ నిర్వహణ. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంతో మారిన ప్రదేశాల గుర్తింపు. కార్మికులకు సత్కారం.

తోడేళ్లగూడెంలో యువతి ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 17: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ యువతి ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తోడేళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్ కుమార్తె కల్యాణి (21) డిగ్రీ వరకు విద్యనభ్యసించింది. అనారోగ్యం కారణంగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈనెల 15న ఎలుకల మందు తాగింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు మందు వాసన రావడంతో వెంటనే కల్యాణిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



వర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు వెంకట్‌రెడ్డి, తదితరులు

సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట పీడీఎస్‌యూ వర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 విద్రోహ దినాన్ని పాటిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 1948 సెప్టెంబరు 17ను విలీన దినమని, విమోచన దినమని పిలుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయాని గుర్తు చేశారు. సెప్టెంబరు 17 విద్రోహ దినమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వర్సిటీలకు వీసీలను నియమించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వర్సిటీలకు నూతనంగా అనుమతులను ఇచ్చి విద్యను ప్రైవేట్‌పరంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రాచకొండ రంజిత్, మర్రి మహేశ్, అర్జున్, జీవన్, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌యూ నేతృత్వంలో..

డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్‌యూ) నేతృత్వంలో మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట మంగళవారం తెలంగాణ విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్లు శ్రావణ్, గణేశ్‌లు హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ హనుమకొండ కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు శరత్, నరేందర్, మహేశ్, చరణ్, అశోక్, దేవేందర్, రక్షత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం ఆధ్వర్యంలో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహిళ గురుకుల అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం (టీఆర్‌డీఈసీఏ) ఆధ్వర్యంలో మహిళ అధ్యాపకులు మంగళవారం శాంతియుత నిరసన దర్నా చేపట్టారు. ఐదు సొసైటీల నేతృత్వంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌డీఈసీఏ అధ్యక్షురాలు డాక్టర్ టి. సాంబలక్ష్మి మాట్లాడుతూ.. గురుకుల కాలపట్టికలో శాస్త్రీయత అవసరమని చెప్పారు. గురుకుల కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని చెప్పారు. తమకు యూజీసీ పే స్కేల్ ఇప్పించాలని, నైట్ స్టే డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 010 పద్దుతో జీతాలు ఇప్పించడంతో పాటు ఆరోగ్య కార్డులను అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్టు

రూ.24వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 17: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో మట్కా నిర్వాహకురాలిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిష్టియన్ కాలనీకి చెందిన జి.శ్రీలత నిరుపేదలకు ఆశలు చూపించి మట్కా నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రూ.24వేల నగదు స్వాధీనం చేసుకుని శ్రీలతను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన శ్రీలతను విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



జాతీయ జెండా ఎగరవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 4,500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. పోరాటంలో అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, అశోక్, స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, వెంకటరమణ, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాటంపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● ఐనవోలు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న అసత్య అబద్ధ ప్రచారాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. ఐనవోలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు నెలకొరిగి, 3,500 గ్రామాలను విముక్తి చేసి నైజాం మెడలు వంచి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యద్వారా తెలంగాణకు విముక్తి జరగలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ ముస్లిం మధ్య యుద్ధం జరిగిందనే అసత్యాన్ని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎందరో బలిదానాలతో తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వాలు తిరస్కరించడం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర నాయకులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్, స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, మంద సుమన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐజాక్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

వర్సిటీ లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా ఐజాక్ ప్రభాకర్ బాధ్యతలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ ఇన్‌చార్జిగా పీఏ ఐజాక్ ప్రభాకర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ఐజాక్ ప్రభాకర్ లైబ్రరీలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఐజాక్ ప్రభాకర్‌ను వర్సిటీ లైబ్రరీ ఉద్యోగులు సంఘం నేతల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువ అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, జావీద్, ఉప్పుల రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేయూ ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డిలు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు తెలిపారు.



ఎంఈడీ పరీక్షలను పరిశీలిస్తున్న కంట్రోలర్ శ్రీరామోజు నరసింహచారి తదితరులు

ఘనంగా ప్రజాపాలన

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్స వాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాపాలన ప్రభుత్వమన్నారు. స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం నాడు రజకార్లపై వీరోచిత పోరాటం చేసి హక్కులు సాధించుకున్న ప్రజల ఆత్మగౌరవాన్ని పునికిపుచ్చుకుని వారి ఆశయ సాధన కోసం ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు బుర్ర కొమరయ్య, ముంజాల రవీందర్, శిరుప అనిల్, ఇర్ఫానీ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి జెండాను ఆవిష్కరించారు. కమిషనర్ రాజేశ్వర్, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు నూనె రాజు, బద్ది సమ్మయ్య, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం రూరల్: మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ జాతీయ జెండాను ఎగుర వేశారు.

● కృష్ణకాలనీ (భూపాలపల్లి): పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎస్పీ కిరణ్ ఖరే ఆవిష్కరించారు అదనపు ఎస్పీ (ఆపరేషన్) బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, డీపీవో ఏవో వసీ ఫర్హానా, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మంగిలాల్, రవాణాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీవో సమ్మానీ, పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరేష్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు జాతీయ జెండా ఆవిష్కరించారు.

● గణపురం : మండల కేంద్రంలోని వివిధ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో భాస్కర్, ఎస్సై అశోక్, గణపురం పీఏసీఎస్ చైర్మన్ కుమార్‌యాదవ్, చెల్పూర్ పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● చిట్యాల : ప్రజాపాలన దినోత్సవాన్ని ఏఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ హేమ,



భూపాలపల్లిలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

పోలీసు స్టేషన్‌లో సీఐ మల్లేష్, వెటర్నరీ ఏడీ డాక్టర్ వెంకన్న, సివిల్ ఆస్పత్రిలో డాక్టర్ అఖిల, జీపీల్లో పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండా అవిష్కరించారు.

● వెంకటాపురం(నూగూరు) : మండలంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ముత్తమ్మ, విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీఈ స్వామిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ జాతీయ జెండాను ఎగురవేశారు.

● వాజేడు: మండలంలో జరిగిన వేడుల్లో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీడీవో విజయ, ఎంఈవో వెంకటేశ్వర్లు, వాజేడు, పేరూరు ఎస్సైలు హరీశ్, కృష్ణప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● కాటారం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాను సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ఆవిష్కరించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపీడీవో బాబు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై కిష్టయ్య, ఏడీఈ నాగరాజు, ఏఈ మేఘనాథ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, ఏఎంసీ కార్యదర్శి షరీఫ్, పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, ఏవో పూర్ణిమ, ఏపీఎం లవకుమార్, డీఏవో బ్రహ్మేశ్వర్‌రావు, ఎంపీవో వీరస్వామి జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్, నాయకులు చీమల రాజు, శ్రీహరి, లచ్చిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి: మండలంలో జరిగిన వేడుకల్లో మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ నాగరాణి, మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురు కులం ప్రిన్సిపాల్ శారదతోపాటు ఎస్సీబీసీ బాలురు, బాలికల హాస్టళ్లు, కేజీబీవీ, మోడల్‌స్కూల్‌లో వార్డెన్లు, గ్రామపంచాయతీ కార్యా లయాల్లో స్పెషలాఫీసర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానో పాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేశారు.

● మహదేవపూర్: మహదేవపూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పరిషత్ సిబ్బంది, ఉపాధిహామీ, ఐకేపీ, తహసీల్దార్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మహాముత్తారం: ప్రజా పరిపాలన దినోత్సవం ఆయా కార్యాలయాల్లో జరగ్గా తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎస్సై మహేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : ప్రజాపాలన దినోత్సవం మండలంలో ఘనంగా జరగ్గా ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, జీసీసీ డివిజనల్ మేనేజర్ ప్రతాపరెడ్డి, సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండ్ సురేష్ కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రేణుక, ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్ జగన్‌మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు పాల్గొన్నానరరు.

● ములుగు : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. రాజకీయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క, జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఎస్పీ శబరీశ్ జాతీయ జెండాను ఎగురవేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద డాక్టర్ అల్లెం అప్పయ్య, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో పాణిని, ఆయా ఇంజనీరింగ్ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

● తాడ్వాయి: మండలకేంద్రంతోపాటు కాటాపూర్, దామెరవాయి, బీరెల్లి, లింగాల, కొడిశాల, ఇందిరానగర్, నర్సింగాపూర్, కామారం, తదితర గ్రామాల్లోని ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో సుమనవాని, తహసీల్దార్ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సాయుధ పోరులో కమ్యూనిస్టులదే కీలకపాత్ర

సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు



వాజేడులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు

వాజేడు, సెప్టెంబరు 17: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులదే కీలకపాత్ర అని సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున రావు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహించారు. పేరూరు నుంచి వాజేడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆచంటి ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ నిజాం పరిపాలను వ్యతిరేకంగా పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రవీందర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, నాయకులు సత్యనారాయణ రాజు, చంటిబాబు, ఖాజావలీ, శివాజీ, యాలం చిరంజీవి, నరేష్, రాంబాబు, శ్రీను, రొడ్డ శ్రీను, వెంకటేశ్వర్లు, బడే రాజు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో బైక్ ర్యాలీలు

ములుగు కలెక్టరేట్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎమ్డీ.అమ్జద్‌పాషా, నాయకులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య, ఇంజం కొమురయ్య, బోడ రమేష్, జక్కుల ఐలయ్య, మాతంగి శ్యాంసుందర్, మామిడి నటరాజ్, కొండ కుమార్, మొలుగూరి రాంబాబు, తోట సంపత్, పరంసింగ్, పైడయ్య, జితేందర్, రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య, నాయకులు జంగిలి సుధాకర్, రాస రాజన్న, చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

కాకతీయఖని: రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్యాలయం నుంచి గణేష్‌చౌక్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు సాయిలు, రమేష్, శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాన్ని, తెలంగాణ విలీన దినోత్సవాన్ని భూపాలపల్లిలోని రావినారాయణరెడ్డి కార్యాలయంలో సీపీఐ నాయకులు నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్, నాయకులు సుగుణ, రామ్‌చందర్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

కాటారం, సెప్టెంబరు 17: బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అంబేద్కర్ కూడలిలో బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, నాయకులు జాతీయ జెండాను ఎగరేశారు. నిజాం నిరంకుశపాలనకు చరమగీతం పాడి తెలంగాణకు విమోచనం కల్పించిన సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ కృషి, ఎందరో వీరుల ప్రాణ త్యాగానికి విలువలేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం జరపడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి సంపత్, నాయకులు గంట అంకయ్య, పాగె రంజిత్, జిల్లెల్ల శ్రీశైలం, డోలి అర్జయ్య, బండి రమేష్, పర్వతాల్లు, వేణు, రవీందర్‌రెడ్డి, సంతోష్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి: మండలకేంద్రంలో నిర్వహించిన తెలంగాణ విమోచన



కాటారంలో జెండా ఎగరేస్తున్న బీజేపీ నాయకులు

దినోత్సవంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లపురం నరేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు, నాయకులు జంగ హన్మంతరెడ్డి, డ్యాగల సలేందర్, మాదరి శ్రీకాంత్, మేడిశెట్టి ఓమ్రా, తాళ్లపల్లి లక్ష్మణ్, సుభాష్, గడ్డం వెంకటేశ్వర్లు, సురేందర్, వెంకట్రాం, తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల: తెలంగాణ విమోచన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య, గొర్రె శశి, మాచర్ల రఘు, అనిల్, సుద్దాల వెంకన్న, గజనాల రవీందర్, శ్రీనివాస్, మైదం శ్రీకాంత్, రాయిని శ్రీనివాస్, పిట్టల నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్, రమేష్, రాజయ్య, రాజయ్య, రంజిత్, నిషాన్, సమ్మయ్య, రాజు, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

భూపాలపల్లి కలెక్టరేట్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆ పార్టీ నేతలు పండ్లు పంపిణీ చేశారు. ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, నాయకులు శీలమంతుల రవింద్రచారి, జినుకల కృష్ణాకర్ రావు, కారుపోతుల యాదగిరి, గుగులోత్ స్వరూప, లవన్, రాయంచు నాగరాజు, నగరపు రమేష్, దండిగ వెంకటేశ్వర్లు, కత్తి హరీష్, గాదం కుమార్, పాపిరెడ్డి, ఎల్కతుర్తి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

● వెంకటాపూర్(రామప్ప): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీ నాయకులు గంగుల రాజ్‌కుమార్, కన్నెబోయిన వీరేందర్, రెడ్డి శ్రీనివాస్, పెసరు గిరిబాబు, శ్రీధర్‌రెడ్డి, బాబీ, అంజి, నాగరాజు, అభి, రాజేందర్, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లి కలెక్టరేట్ : ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన బీజేపీ నాయకులు భూపాలపల్లిలో ఘనంగా నిర్వహించారు. మంజూర్‌నగర్‌లోని జీజీహెచ్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుసూదన్‌రెడి, నేతలు దొంగల రాజేందర్, బట్టురవి, రఘునాథ్‌రెడ్డి, విప్లవకుమార్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

● కాటారం: మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్రనేత చల్ల నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జి పిలమర్రి సంపత్, నాయకులు గంట అంకయ్య, పాగె రంజిత్, జిల్లెల్ల శ్రీశైలం, డోలి అర్జయ్య, బండి రమేష్, పర్వతాలు, వేణు, రవీందర్‌రెడ్డి, సంతోష్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో పల్లెలు మెరవాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17: స్వచ్ఛతతో పల్లెలు మెరవాలనిరాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకరతో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రమ దానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహాత్ముడి కలలను నిజం చేసేందుకు స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో గత ఏడాది స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 17నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలనే సంకల్పంతో అధికారులు ముందుకు సాగాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే జనం అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. అంతకుముందు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ములుగు గ్రామపంచాయతీలో మహిళలు, పురుషుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీపీవో దేవరాజ్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 17: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చదువు నేర్పిన గురువులతోపాటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాలైన వెంకటాపురం, వాజేడు మండలాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వాజేడు మండలంలోని కొంగాల, బొగత జలపాతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, వెంకటాపురం మండలంలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మరమ్మతు పనులను రెండునెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం మంలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు.మందుల నిల్వ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది మంత్రి సీతక్కను శాలువాలతో సన్మానించారు. ఆమె వెంట మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, తదితరులు ఉన్నారు.



కూరగాయల మార్కెట్ ఆవరణలో శ్రమదానం చేస్తున్న మంత్రి సీతక్క

అధికారులకు సన్మానం

తాడ్వాయి : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల సమయంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క సన్మానించారు. ఈసందర్భంగా మంగళవారం ఆమె మండల స్పెషలాఫీసర్ డాక్టర్ అప్పయ్య, తహసీల్దార్ టి.రవీందర్, ఎంపీడీవో సుమనవాణి, ఎంపీవో శ్రీధర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఇరిగేషన్ ఆఫీసర్ అరవింద్‌లకు ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వరద సహాయ నిధికి ట్రస్మా సాయం

ములుగు, సెప్టెంబరు 17: వరద బాధితుల సహాయార్థం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసి యేషన్ (ట్రస్మా) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 23 పాఠశాలల విద్యా ర్థులు సేకరించిన రూ.4 లక్షల 50 వేల చెక్కును మంత్రి సీతక్కకు అందజేశారు. ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీతక్క విద్యార్థులను అభినందించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ట్రస్మా అధ్యక్షుడు పోశాల వీరమల్లు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశా ధికారి డి.సురేందర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మధుసుదన్, కార్యదర్శి రమేష్‌రావు, జిల్లా అడ్వైజర్ కందాల రమేష్, రాష్ట్ర జాయింట్ సెక్ర టరీ రవికిరణ్, ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి, మోహన్‌రావు, రాజేం దర్‌రెడ్డి, కుమార్, ప్రసాద్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు చెక్కును అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దుర్మార్గం

ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఏటూరునాగారం, సెప్టెంబరు 17: తెలంగాణ తల్లి విగ్రహం స్థాపించే చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ చర్య అని ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి విమర్శించారు. మండల కేం ద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆమె క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ప్రతి ష్ఠించాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సరికాదని మండిపడ్డారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు పంపడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్, మాజీ ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, నాయకులు మాదరి చంద్రమౌళి, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, కాళ్ల రామకృష్ణ, పాలకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను నాగజ్యోతి పరామర్శించారు.



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాగజ్యోతి తదితరులు

ఉరి వేసుకొని బిల్ట్ కార్మికుడి ఆత్మహత్య



దయాకర్‌రెడ్డి (ఫైల్)

మంగపేట, సెప్టెంబరు 17: కుటుంబ కలహాలతో బిల్ట్ పర్మనెంట్ కార్మికుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కమలాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై సూరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ కాలనీలో కుప్పిలి దయాకర్‌రెడ్డి(55), పార్వతి దంపతులు నివాసముంటున్నారు. భార్యాభర్తల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం కూడా ఇద్దరు ఘర్షణ పడ్డారు. దీంతో దయాకర్‌రెడ్డి తన ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై సూరి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుండెపోటుతో కన్నుమూసిన మరో కార్మికుడు

గుండెపోటుతో బిల్ట్ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కమలాపురంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం ఫినిక్స్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న రాంబాబుకు ఉదయం హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో అతడిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తున్న క్రమంలోనే రాంబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

రేగొండ, సెప్టెంబరు 17: పాముకాటుతో యువకుడు మృతి చెందిన సంఘటన గోరికొత్తపల్లి మండలంలోని చెంచుపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాటగిరి దుర్గారావు(29) ఉదయం వ్యవసాయ కూలికి వెళ్లాడు. సాయం త్రం ఇంటికి చేరుకొని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. నోట్లోంచి నురగ రావడంతో పాము కాటు వేసిందని గుర్తించారు. వైద్యం నిమిత్తం తరలించే లోపే దుర్గారావు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పరకాల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుఇ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమర్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, సెప్టెంబరు 17: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించొచ్చని భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్ అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛపక్వాడ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఉద్యోగులతో కలిసి స్వచ్ఛ పక్వాడ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు జ్యోతి, సురేఖ, రవికుమార్, కావూరి మారుతి, పోషమల్లు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈ రమేష్‌కు అస్వస్థత

ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి ఎస్ఈ(ఐఈడీ) గోళ్ల రమేష్ బీపీ డౌన్ అయి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయన్ను ఏరియా సింగరేణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. రమేష్ ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు పేర్కొన్నారు.

'వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి'

కాటారం, సెప్టెంబరు 17:జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య, సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపల్లి పరిధిలోని కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. వసతిగృహంలో పరిశుభ్రత లేదని, తాగునీటి సౌకర్యం కరువైందని, ఉడకని అన్నం, నీళ్ల పప్పుచారుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొగుళ్లపల్లి మోడల్‌స్కూల్, కస్తూర్బా విద్యాలయంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ, మైనారిటీ విద్యాలయాల్లోనూ సమస్యలున్నాయని, అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలపి అన్నారు.